

ఆ పిలుపే 'తారక' మంత్రం

- టీడీపీ ఆవిర్భావం నుంచీ అండగా శ్రీకాకుళం జిల్లా
- చైతన్య యాత్రతో జనంలోకి..
- ఎన్టీఆర్ ప్రసంగాలతో ఆకర్షితులైన ప్రజలు
- ఎందరికో రాజకీయ జీవితమిచ్చిన 'అన్నగారు'

- నేడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక దినోత్సవం

4లో



కంకర అక్రమ తవ్వకాలతో చదునుగా మారిన ముక్తింపురం కొండ

చించేసిన హెచ్చరిక బోర్డు



మాకెవరు అడ్డొచ్చేది?

- ముక్తింపురం కొండపై ఆగని తవ్వకాలు
- భారీగా తరలిపోతున్న కంకర
- హెచ్చరిక బోర్డును చించేసిన అక్రమార్కులు
- అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తున్న వైనం

రణస్థలం మండలం ముక్తింపురం కొండపై కంకర అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. ఇక్కడ నుంచి వేలాది క్యూబిక్ మీటర్లలో కంకరను తరలించి సగానికిపైగా కొండను చదును చేసేశారు. దీనిపై గత నెల 8న 'ఇక్కడ ఓ కొండ ఉండేది' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు అధికారులు స్పందించి ఆ కొండపై 'ఇది ప్రభుత్వం స్థలం, కంకర తవ్వకాలు చేపడితే శిక్షర్హులు' అంటూ హెచ్చరిక నోటీసు బోర్డు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అక్రమార్కులు ఆ హెచ్చరిక బోర్డును చింపేసి.. యథావిధిగా కంకర తరలించుకుపోతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రణస్థలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 'కొండనూ వదలం. ప్రభుత్వ భూమి అయినా విడిచిపెట్టం. అంతా మా ఇష్టం. మమ్మల్ని ఆపేది ఎవరు?' అంటూ అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అధికారుల హెచ్చరికలను సైతం బేఖాతరు చేస్తూ కొండలకు కొండలే దోచేస్తున్నారు. కంకర అక్రమ తవ్వకాలు చేపడుతూ.. సొమ్ము చేసుకుంటున్నారు. రణస్థలం మండలం ముక్తింపురంలో 58 సర్వే నంబర్‌లో 76 ఎకరాల్లో కొండ పోరంబోకు భూమి ఉంది. వననర్సరీలో భాగంగా అప్పటికే ఆ భూమిలో అటవీ శాఖ నీలగిరి, ఆకేసు చెట్లు పెంచుతోంది. ఈ ప్రాంతంలో కంకరకు డిమాండ్ ఉండడంతో అక్రమార్కుల కన్ను ఈ కొండపై పడింది. కనీస అనుమతులు లేకుండా ఈ కొండపై వేలాది క్యూబిక్‌మీటర్ల కంకరను తవ్వేస్తున్నారు. వందలాది లారీలు, ట్రాక్టర్లలో తరలించుకుపోతూనే ఉన్నారు. దీనిపై గత నెల 8న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించగా అధికారులు స్పందించారు. 'ఇది ప్రభుత్వ భూమి అని.. అక్రమ తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవు' అని హెచ్చరిక బోర్డు పెట్టారు. కొన్నాళ్లపాటు స్తబ్దుగా ఉన్న అక్రమార్కులు.. మళ్లీ తవ్వకాలు ప్రారంభించారు. ఆ హెచ్చరిక బోర్డును చింపేసి.. యథావిధిగా తమ పని కానిచేస్తున్నారు. కొండ పూర్తిగా ఆనవాళ్లు కోల్పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత (మిగతా 4వ పేజీలో..)

- వైసీపీ హయాం నుంచీ..

ముక్తింపురం కొండను ఆక్రమించేందుకు గతంలో వైసీపీ నేతలు పన్నాగం పన్నారు. ఇక్కడ ఎకరా రూ.5కోట్లపైగా పలుకుతోంది. ఈ భూమి పక్కనే ప్రైవేటు లేఅవుట్‌లు వెలిశాయి. ఇక్కడ సెంటు భూమి రూ.5లక్షలు. మూడున్నర సెంట్ల ఇంటి ప్లాట్ రూ.17 లక్షలకు విక్రయిస్తున్నారు. దీంతో కొండ పోరంబోకు భూమిపై కొంతమంది కన్నుపడింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొండ దిగువ ప్రాంతంలో 15ఎకరాలు చదును చేసి ప్లాట్లుగా విభజించారు. గ్రామంలో నిరుపేదల పేరిట ప్లాట్లను విభజించారు. ప్రభుత్వం నుంచి కానీ, అధికారుల నుంచి కానీ అనుమతులు తీసుకోలేదు. మొత్తం 200మందికిపైగా ప్లాట్లు కట్టబెట్టారు. అప్పట్లో ప్రభుత్వం మంజూరు చేసినట్టు ప్రచారం చేసుకున్నారు. కానీ తెరవెనుక మొత్తం భూమిని ఆక్రమించుకోవాలని అప్పటి చోటానేతలు యత్నించారు. దీంతో అది రెండు సామాజికవర్గాల మధ్య వివాదంగా మారిపోయింది. గతేడాది ఫిబ్రవరి 4న ఘర్షణకు దారితీయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆ తరువాత అధికారులు వచ్చి బోర్డులు పాతడంతో వివాదం సద్దుమణిగింది. కానీ ఏడాది తిరగక ముందే కంకర దందా నడిచింది. ఇప్పుడు కూడా హెచ్చరిక బోర్డులు పెట్టినా.. అక్రమార్కులు బేఖాతరు చేస్తుండడం చర్చనీయాంశమవుతోంది.



వీజీ పురం కేజీబీవీలో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

ఆహారంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు

- ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి

6లో

సమాచారం

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

అరసవల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని వచ్చే నెల 5న జిల్లాలో పలాస, టెక్కలి, శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌ల నుంచి భద్రాచలం వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఏ.విజయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఈ బస్సులు ఏప్రిల్ 5న సాయంత్రం ఏడు గంటలకు శ్రీకాకుళం కాంప్లెక్స్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు భద్రాచలం చేరుకుంటాయి. స్వామి దర్శనం అనంతరం 6న సాయంత్రం 5గంటలకు భద్రాచలంలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయానికి శ్రీకాకుళం చేరుకుంటాయి. ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కల్పించా'మని విజయకుమార్ తెలిపారు. అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థంలో సీతారాముల కల్యాణం చూసేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని వివరాలకు 9959225608, 9959225609, 9959225610, 99592 25611, 08942-223188 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

7 నుంచి డిగ్రీ నాలుగో సెమిస్టర్

ఎచ్చెర్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థుల నాలుగో సెమిస్టర్ పరీక్షలు వచ్చే నెల 7 నుంచి 21 వరకు జరుగుతాయని ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ జి.పద్మారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 53 కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు నిర్వహించనున్న ఈ పరీక్షలకు సుమారు 7 వేల మంది హాజరుకానున్నారని వెల్లడించారు. డిగ్రీ సెమిస్టర్‌కు సంబంధించి స్పెషల్‌డ్రైవ్ పరీక్షలను మే చివరి వారంలో నిర్వహిస్తామని తెలిపారు.



శ్రీకాకుళం నాగావళి వంతెన వద్ద ఆటోలు, బస్సులు నిలిచిపోవడంతో ట్రాఫిక్ ఇక్కట్లు



అటుగా ప్రయాణం.. నరకమే

- శ్రీకాకుళం కొత్తవంతెనపై నిత్యం ట్రాఫిక్ రద్దీ
- ఇష్టారాజ్యంగా బస్సులు, ఆటోల రాకపోకలు
- నిబంధనలు పాటించని వాహనదారులు
- తరచూ రోడ్డు ప్రమాదాలు

శ్రీకాకుళం క్రైం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోతోంది. ప్రధానంగా శ్రీకాకుళంలో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ఇరుకు రహదారులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. శ్రీకాకుళంలోని కొత్త వంతెనపై ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, ఆటోలు నిలిపివేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహనాల రద్దీకి అనుగుణంగా ప్రధాన రహదారుల విస్తరణ జరగడం లేదు. ప్రత్యామ్నాయ దారులపై కూడా అధికారులు దృష్టి సారించడం లేదు. దీంతో ట్రాఫిక్ చిక్కులు తప్పడం లేదు.

- శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం, పొందూరు, రాజాం, బొబ్బిలి వెళ్లే వాహనాలు డేఅండ్‌నైట్ జంక్షన్ సమీపంలో ఉన్న నాగావళి నదిపై నిర్మించిన కొత్తవంతెన మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. విశాఖపట్నం నుంచి వచ్చే వాహనాలు కూడా ఇదే బ్రిడ్జి మీదుగా వస్తుంటాయి. నిత్యం ఈ వంతెనపై వాహనాల రద్దీ కనిపిస్తోంది. ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు ఈ వంతెన చివరన ప్రయాణికులను దించేందుకు నిలిపేస్తున్నారు. అలాగే డేఅండ్‌నైట్ జంక్షన్ నుంచి విశాఖపట్నం, లావేరు, చిలకపాలెం వెళ్లే ఆటోలు సైతం బ్రిడ్జి ప్రారంభంలో నిలిపి ప్రయాణికులను ఎక్కిస్తున్నారు. దీంతో బ్రిడ్జి నుంచి డే అండ్‌నైట్ జంక్షన్ వరకు ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. ఇదే ప్రాంతంలో అత్యధిక ప్రైవేటు ఆస్పత్రులు, పాఠశాలలు (మిగతా 4వ పేజీలో..)

పలాస ఏఎంసీ చైర్మన్‌గా మల్లా శ్రీనివాసరావు



పలాస, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మల్లా శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, నియోజకవర్గసమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరికి వీరవిధేయుడిగా ఉన్న శ్రీనివాసరావును రెండోసారి ఏఎంసీ చైర్మన్ పదవి వరించింది. ఈయన 2015 నుంచి 2020 వరకూ ఏఎంసీ చైర్మన్‌గా వ్యవహరించారు. ప్రముఖ జీడివ్యాపారిగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం జీడిపప్పు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గతంలో ఈయన రాష్ట్ర టీడీపీ కో ఆర్డినేషన్ కమిటీ కార్యదర్శిగా, ఖుర్దా డివిజన్ రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యుడిగా పనిచేశారు. దీంతోపాటు అనేక పార్టీ పదవులు పొందారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గౌతు శిరీష, యార్లగడ్డ వెం కన్న చౌదరి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, మాజీమంత్రి గౌతు శ్యామసుందర శివాజీకి శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

పట్టుకోండి చూద్దాం!

- జిల్లా నుంచి ఒడిశాకు ఇసుక తరలింపు
- పట్టించుకోని అధికారులు

మెళియాపుట్టి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వంశధార నది నుంచి గత రెండు నెలలుగా ఇసుకను ఒడిశాకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. కొత్తూరు మండలం ఆకులతంపర రీచ్ నుంచి ఇసుకను హిరమండలం, పాతపట్నం, మెళియాపుట్టి మండలాలు దాటుకుని ఒడిశా రాష్ట్రంలోని బిన్నాళ, బావుసోళ, ఉప్పలాడ ప్రాంతాలకు ట్రాక్టర్లలో అక్రమ రవాణా చేస్తున్నారు. దమ్ముంటే పట్టుకోండి చూద్దాం.. అంటూ పోలీసులు, రెవెన్యూ అధికారులకు సవాల్ విసురుతున్నారు. ఒడిశాలో ఇసుక మంచి డిమాండ్ ఉంది. ట్రాక్టర్ లోడు రూ.8వేలకుపైగా పలుకుతోంది. ఆంధ్రాలో ఉచిత ఇసుక విధానం అమలుకావడంతో.. వంశధార నది నుంచి రోజు 20 నుంచి 30 ట్రాక్టర్లలో ఒడిశాకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒడిశాకు చెందిన కొంతమంది ఇసుక వ్యాపారులు కొంతమంది అధికారులకు ముందుగానే సమాచారం ఇచ్చి.. తమకు అడ్డులేకుండా మంతనాలు చేసుకుని ఇసుక తరలిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికంగా సెలవు రోజుల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ఇసుక వ్యాపారులకు కొంతమంది నేతలు సహకారం ఉండడంతో అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. రాత్రివేళలో కొంత మంది రెవెన్యూ సిబ్బంది అడ్డుకోగా.. వారిని తప్పించుకుని అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఇటీవల ఆంధ్రా రిజిస్ట్రేషన్ ట్రాక్టర్లపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో కొంతమంది వ్యాపారులు ఆంధ్రా రిజిస్ట్రేషన్ గల ట్రాక్టర్లతో సరిహద్దు ప్రాంతాల వరకు ఇసుకను తరలించి డంపింగ్ చేస్తున్నారు. మహేంద్రతయన నది సమీపంలోని కొసమాళ వద్ద, శేఖరాపురం రహదారిలో, వసుంధర, పెద్దజగన్నాథపురం వంటి ప్రాంతాల్లో అధికంగా ఇసుక నిల్వలు దర్శనమిస్తున్నాయి. ఇక్కడ నుంచి ఒడిశా ట్రాక్టర్లలో లోడ్ చేసి.. అక్రమ రవాణా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై మెళియాపుట్టి తహసీల్దార్ బి.పాపారావు వద్ద ప్రస్తావించగా.. 'ఒడిశాకు ఇసుక తరలిస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. సరిహద్దు వీఆర్వోలతో నిఘా ఉంచాం. రాత్రివేళల్లో అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పోలీసులకు కూడా తెలిపాం. వంశధార నది సమీపంలో ఇసుక తవ్వకాలు కట్టడి చేసేందుకు సంబంధించి అధికారులతో చర్చిస్తామ'ని తెలిపారు.



ఆకులతంపర రీచ్‌లో రాత్రివేళ ఇసుక అక్రమ తవ్వకాలు

ఒడిశాకు ట్రాక్టర్లలో అక్రమ రవాణా



ఇది చెత్త కాదు.. రూ.లక్షల సామగ్రి

అరసవల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం ఆవరణలోని ఖాళీ స్థలంలో గుట్టగా పోసిన టేబుల్ స్టాండ్లు, దుమ్ము, ధూళి పట్టిన ఫ్రీజర్లు దర్శనమిస్తున్నాయి. వాటిని చూసిన వెంటనే అవి పనికిరానివని, పాడైపోయినందున అలా వృథాగా పడేశారని అనుకుంటే పొరపాటే. వివిధ ఆస్పత్రులకు అవసరం మేరకు సరఫరా చేసేందుకు వీటిని ఇక్కడ ఉంచారు. కాగా.. రూ.లక్షల విలువైన సామగ్రి ఆరుబయటే పడేయడంతో.. ఎండకు ఎండి, వానకు తడిసి అవి పాడైపోతున్నాయి. ఆదివారం కురిసిన వర్షానికి పైకప్పు నుంచి నీరు పడి ఫ్రీజర్లు తడిసి.. తుప్పుపట్టాయి. కొత్త సామగ్రి భద్రపరిచే విధానం ఇదేనా అంటూ పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అవసరమైన ఆస్పత్రులకు వాటిని సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో బాలమురళీ కృష్ణ వద్ద ప్రస్తావించగా.. కొద్దిరోజుల్లో సామగ్రిని, ఫ్రీజర్లను అవసరమైన ఆస్పత్రులకు తరలిస్తామన్నారు. అలాగే ఆస్పత్రుల్లో వృథాగా ఉన్న సామగ్రిని కూడా జిల్లావ్యాప్తంగా సర్దుబాటు చేసి వినియోగంలోకి తెస్తామని తెలిపారు.



ఆ పిలుపే తారక మంత్రం

- టీడీపీ ఆవిర్భావం నుంచీ అండగా శ్రీకాకుళం జిల్లా
- చైతన్య యాత్రతో జనంలోకి..
- ఎన్టీఆర్ ప్రసంగాలతో ఆకర్షితులైన ప్రజలు
- ఎందరికో రాజకీయ జీవితమిచ్చిన 'అన్నగారు'
- ఇప్పటికీ అదే ఆదరణ..
- నేడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక దినోత్సవం

శ్రీకాకుళం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు... అభిమానులు ప్రేమతో పిలుచుకునే ఎన్టీఆర్.. వెండితెర వేలుపు. శ్రీరాముడిగా... శ్రీకృష్ణుడిగా తెలుగు ప్రజలు అభిమానించే కథా 'నాయకుడు'. అప్పటి వరకు వెండితెరను ఏలిన ఆ నాయకుడు... 'తెలుగుదేశం' పార్టీతో రాష్ట్ర రాజకీయ చరిత్రలో పెనుమార్పులకు కారణమయ్యాడు. 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించి... 'అన్నగారు'గా ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి.. సంచలనం సృష్టించారు. 'అన్న గారి' పిలుపుతో అప్పట్లో పార్టీలో చేరిన ఎందరో జిల్లా యువకులు రాజకీయాల్లో ముఖ్యపాత్ర పోషించారు. ప్రస్తుతం వారి వారసులూ అదే బాటలో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం జిల్లాలో తెలుగుదేశం వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

అపూర్వ స్వాగతం

తెలుగుదేశం పార్టీని ప్రారంభించగానే జిల్లా ప్రజల చూపు ఒక్కసారిగా అటువైపు మళ్లింది. ఎన్నికలకు ఎక్కువగా సమయం ఇవ్వకుండా నిర్వహించాలని అప్పటి అధికార పార్టీ భావించింది. దీన్ని గుర్తించిన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతా సుడిగాలిలా చుట్టేశారు. 'చైతన్యయాత్ర'లో భాగంగా శ్రీకాకుళం జిల్లాకు వచ్చిన ఎన్టీఆర్‌కు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. నాయకులు, ముఖ్యంగా యువత నుంచి అదే స్థాయిలో ఆదరణ లభించింది.

లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి...

తన తనయుడు హరికృష్ణ సారథిగా చేపట్టిన 'చైతన్య యాత్ర'లో భాగంగా జిల్లాకు వచ్చిన ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపన వెనుక గల ఉద్దేశాన్ని ప్రజలకు స్పష్టంగా చెప్పగలిగారు. ఆశయాలను జనంలోకి తీసుకెళ్లగలిగారు. భవిష్యత్తు ప్రణాళికను వివరించగలిగారు. తెలుగుదేశం పార్టీ తరఫున బరిలోకి దిగిన నాయకులను ప్రజలకు పరిచయం చేశారు. మారుమూల ప్రజలకు.. అప్పటి మండల స్థాయి నాయకులకు ఎన్టీఆర్ ప్రసంగం ఎంతగానో ఆకట్టుకుంది. ఎన్టీఆర్ పిలుపుతోనే కింజరాపు ఎర్రన్నాయుడు, తమ్మినేని సీతారాం, కావలి ప్రతిభాభారతి, కిమిడి కళావెంకటరావు వంటివారు తెరపైకి వచ్చారు.

ఇప్పటికీ అదే ఆదరణ

శ్రీకాకుళం జిల్లాలో తెలుగుదేశం పార్టీకి ఇప్పటికీ ప్రజల్లో అదే ఆదరణ ఉంది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఒడిదుడుకులు చవిచూసినప్పటికీ.. జిల్లాలోని కార్యకర్తలు, ఓటర్లు టీడీపీ వైపే ఉంటున్నారు. 1983లో తెలుగుదేశం పార్టీ తరఫున గెలిచిన వారిలో అనంతరం జరిగిన పరిణామంలో కొందరు ఇండిపెండెంట్లుగా పోటీ చేసి... తర్వాత మళ్లీ టీడీపీలో చేరడం.. మరికొందరు కాలక్రమంలో పార్టీలు మారిపోయినా ఆ నియోజకవర్గాల ప్రజలు మాత్రం టీడీపీతోనే ఉన్నారు. పోటీలో ఉన్నది ఎవరన్నది కాకుండా...తెలుగుదేశం పార్టీని మాత్రమే చూసి ఓట్లు వేసిన సందర్భాలు అనేకం. 2024లో ఎన్నికల్లో శ్రీకాకుళం జిల్లాలో మొత్తం స్థానాలను తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుందంటే ప్రజలకు ఉండే అభిమానం ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. స్థానిక నాయకుల ప్రభావం కొంతమేర ఉన్నప్పటికీ అత్యధిక శాతం తెలుగుదేశం పార్టీ మీద ప్రజలకు ఉన్న అభిమానమే కారణమని చెప్పవచ్చు.

సిక్కోలు అంటే మక్కువ


ఎన్టీఆర్‌కు శ్రీకాకుళం జిల్లా అంటే ఎంతో మక్కువ. 1982లో కార్మిక నాయకుడిగా ఖాకీ దుస్తులు ధరించి జిల్లా అంతటా చైతన్య రథంతో చుట్టివచ్చారు. 1994లో టెక్కలి నుంచి పోటీ చేసి అప్పట్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వజ్జ బాబూరావుపై భారీ ఓట్ల అధిక్యంతో ఎన్టీఆర్ గెలుపొందారు. 1995 అనంతర పరిణామాలతో జిల్లా అంతటా మరోమారు ప్రచారం చేశారు. టెక్కలిలో వంద పడకల ఏరియా ఆసుపత్రి (ప్రస్తుత జిల్లా కేంద్ర ఆసుపత్రి)కి ఎన్టీఆర్ స్వయంగా శంకుస్థాపన చేశారు. నరసన్నపేట నియోజకవర్గానికి వంశధార నీటిని అందించేందుకు శ్రీకారం చుట్టారు. కింజరాపు ఎర్రన్నాయుడు, గౌతు శివాజీ, కావలి ప్రతిభాభారతి, గుండ అప్పలసూర్యనారాయణ, కలమట మోహనరావు, బగ్గు రమణమూర్తి, కిమిడి కళావెంకటరావు.. వీళ్లందరికీ ఎన్టీఆర్‌తో ఉన్న అనుబంధం మాటలకు అందనిదని చెప్పవచ్చు.

1983లో జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు..

నియోజకవర్గం	గెలుపొందిన అభ్యర్థి	పార్టీ
ఇచ్ఛాపురం	మండవ వెంకట కృష్ణారావు	టీడీపీ
సోంపేట	మజ్జి నారాయణరావు	కాంగ్రెస్
టెక్కలి	అట్టాడ జనార్దనరావు	టీడీపీ
హరిశ్చంద్రపురం	కింజరాపు ఎర్రన్నాయుడు	టీడీపీ
నరసన్నపేట	శిమ్మ ప్రభాకరరావు	టీడీపీ
పాతపట్నం	తోట తులసీనాయుడు	టీడీపీ
కొత్తూరు	నిమ్మక గోపాలరావు	టీడీపీ
పాలకొండ	గొనిపాటి శ్యామలరావు	టీడీపీ
ఆమదాలవలస	తమ్మినేని సీతారాం	టీడీపీ
ఎచ్చెర్ల	కావలి ప్రతిభా భారతి	టీడీపీ
శ్రీకాకుళం	తంగి సత్యనారాయణ	టీడీపీ
ఉణుకూరు	కిమిడి కళావెంకటరావు	టీడీపీ
చీపురుపల్లి (పాక్షికంగా)	త్రిపురాన వెంకటరత్నం	టీడీపీ

11 స్థానాల్లో విజయం

శ్రీకాకుళం జిల్లాలో అప్పట్లో 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండేవి. వీటితో పాటు విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి నియోజకవర్గంలో శ్రీకాకుళం జిల్లాలోని పొందూరు, జి.సిగడాం మండలాలు ఉండేవి. దీంతో మొత్తం పన్నెండున్నర నియోజకవర్గాలుగా పిలుచుకునేవారు. అంతవరకు కాంగ్రెస్ పార్టీకి పెట్టిన కోటలా ఉండే శ్రీకాకుళం జిల్లా తెలుగుదేశం ఆవిర్భావంతో ఆ పార్టీకి కంచుకోటగా మారిపోయింది. ఇప్పటికీ అదే తీరు కొనసాగుతోంది. నాయకుల్లో మార్పులు వచ్చినా ప్రజలు మాత్రం అధిక శాతం టీడీపీ వైపు ఉండిపోయారు. 1983లో జరిగిన ఎన్నికల్లో 11 స్థానాల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులే గెలుపొందారు. కేవలం సోంపేట స్థానాన్ని మాత్రమే కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. శ్రీకాకుళం నుంచి గెలుపొందిన తంగి సత్యనారాయణకు స్పీకర్‌గా అవకాశం కల్పించారు.



ఎన్టీఆర్‌తో కావలి ప్రతిభాభారతి (ఫైల్)









టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావుతో బగ్గు రమణమూర్తి, కింజరాపు ఎర్రన్నాయుడు, గుండ అప్పలసూర్యనారాయణ, కిమిడి కళా వెంకటరావు (ఫైల్)



టెక్కలిలో అప్పట్లో ఎన్నికల ప్రచారంలో ఎన్టీఆర్.. వెనుక ఎర్రన్నాయుడు (ఫైల్)

ఆ రెండు రోజులూ విధులే

- రేపు, 31న పని చేయనున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలు
- ఉగాది, రంజాన్ పండుగల నాడూ పనులు
- ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడమే కారణం

శ్రీకాకుళం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం సమకూర్చే శాఖలలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఒకటి. ఏటా ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ ఒకటో తేదీన ప్రారంభమై.. మార్చి 31తో ముగుస్తుంది. ఈ దఫా ముఖ్యమైన పండగలు ఆర్థిక సంవత్సరం చివరన వచ్చాయి. తెలుగు ప్రజలు కచ్చితంగా జరుపుకొనే పండగ 'ఉగాది'. అందరూ తెలుగు కొత్త సంవత్సరంగా భావించి ఆరోజే అన్ని కార్యక్రమాలను ప్రారంభిస్తారు. ముస్లింలకు పవిత్రమైన పండగ 'రంజాన్'. ఈ నెల 30న ఉగాది పండగతో పాటు ఆదివారం వచ్చింది. 31న రంజాన్ పండగ ఉంది. ఈ రోజుల్లో వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు సెలవులు ఇచ్చారు. కానీ ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాలు మాత్రం ఈ నెల 30, 31న పనిచేస్తాయి. జిల్లాలో ఉన్న 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో యథావిధిగా ఆ రెండు రోజులు రిజిస్ట్రేషన్లు జరుగనున్నాయి. ఈ విషయాన్ని రిజిస్ట్రేషన్ అధికారులు ధ్రువీకరించారు.

అటుగా ప్రయాణం.. నరకమే

(మూడో పేజీ తరువాయి)

ఉన్నాయి. ట్రాఫిక్ కారణంగా ఆస్పత్రులు, పాఠశాలలకు వెళ్లేవారు నరకయాతన పడుతున్నారు.

ప్రమాదాలెన్నో...

నాగావళి కొత్త వంతెన ప్రారంభంలో రహదారి ఇరుకుగా ఉంటుంది. కాగా.. విశాఖ నుంచి వచ్చే వాహనాలను నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ నిలిపేయడం ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. అలాగే బస్సులు, కార్లలో అతివేగంగా రాకపోకలు సాగిస్తుండడంతో కొత్త వంతెనపై తరచూ రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

- ఈ నెల 10న కొత్తవంతెనపై ఆర్టీసీ బస్సు ఢీకొని ఎచ్చెర్ల మండలం కుంచాలకురమయ్యపేట చెందిన వెంపాడ రాజేశ్వరి అనే నిండు గర్భిణి మృతి చెందింది. ఈమె భర్త దుర్గారావుతో కలిసి ద్విచక్ర వాహనంపై ఆస్పత్రికి వెళ్లి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. తీవ్ర గాయాలతో ఉన్న ఆమెను ఓ ఆటోడ్రైవర్ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది. గర్భస్థ శిశువు కూడా చనిపోయింది. కొన్నాళ్ల కిందట ఇదే బ్రిడ్జిపై మృతురాలి భర్త దుర్గారావు మేనత్త సైతం ఇదే రీతిలో వాహనం ఢీకొని మరణించింది.
- గత నెలలో ఓ ఆర్టీసీ బస్సుడ్రైవర్ కొత్త వంతెనపై అతివేగంగా వెళ్తూ కారుని ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారు యజమానిపై డ్రైవర్ బుకాయించేందుకు ప్ర యత్నించగా స్థానికులు ఎదురుతిరిగారు. తప్పనిసరి పరిస్థితుల్లో కారు అద్దాన్ని ఆర్టీసి డ్రైవర్ బాగు చేయించారు.
- కొన్నేళ్ల కిందట ఇదే జంక్షన్‌లో ఎక్సైజ్ డీసీ కారును అతివేగంగా నడుపుతూ.. సైకిల్ మీద వెళ్తున్న ఇద్దరు యువకులను ఢీకొట్టారు. వారు అక్కడికక్కడే మృతి చెందారు. ఇటువంటి ఘటనలు కోకొల్లలు.
- కొత్త వంతెనతో పాటు, జిల్లా పోలీసు కార్యాలయం, జిల్లా కోర్టు పరిసర ప్రాంతాల్లో సైతం ప్రైవేట్ బస్సులు, ఆటోలు ఇష్టానుసారంగా నిలిపివేస్తున్నా రు. నిబంధనలు పాటించని వాహనదారులను ట్రాఫిక్ పోలీసులు చూసీ చూడనట్టు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం

డేఅండ్‌నైట్ కూడలిలో ట్రాఫిక్ సమస్య వాస్తవమే. ఆర్టీసీ సిబ్బందికి హెచ్చరించినా బ్రిడ్జి ముందు ప్రయాణికులను దించేందుకు బస్సులు ఆపుతున్నారు. ఆటోడ్రైవర్లు సైతం ఇదే పంథాలో నడుస్తున్నారు. ఈ విషయంపై ఆర్టీసీ, ప్రైవేట్ బస్సు యజమానులతో చర్చిస్తాం. ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

- నాగరాజు, ట్రాపిక్ సీఐ

మాకెవరు అడ్డొచ్చేది?

(మూడో పేజీ తరువాయి)

జరుగుతున్నా భూగర్భ గనులు, మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోకపో వడం అనుమానాలకు తావిస్తోందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, అధికారులు స్పందించి కంకర అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

ముక్తింపురం కొండలో గ్రావెల్ తవ్వకాలపై ఫిర్యాదుల మేరకు సిబ్బందిని అప్రమత్తం చేశాం. పూర్తిస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారుల ఆదేశాల మేర కు బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఇప్పటికే అక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేశాం.

- ఎన్.ప్రసాద్, తహసీల్దార్, రణస్థలం

ఉగాది వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

- డీఆర్వో వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉగాది వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. వేడుకల నిర్వహణపై అధికారులతో ఆయన తన ఛాంబర్‌లో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఈ నెల 30న ఉగాది వేడుకలను అంబేడ్కర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగువారి సంప్రదాయం ఉట్టిపడే విధంగా మామిడాకుల తోరణాలు, అరటి చెట్లతో అలంకరించాలని సూచించారు. ఉగాది పంచాంగ శ్రవణం, వేదాశీర్వచనం ఏర్పాట్లను దేవదాయశాఖ, ఉగాది పచ్చడి, పులిహోర, చక్కెర పొంగలి స్త్రీ, శిశు సంక్షేమశాఖ, డీఎస్‌ఓ పంపిణీ చేయాలని సూచించారు. శాంతిభద్రతలను పోలీసు శాఖ, వేదిక అలంకరణ బాధ్యతలను వ్యవసాయ, ఉద్యానవన శాఖకు అప్పగిస్తున్నామన్నారు. కవి సమ్మేళనం నిర్వహణ బాధ్యతలను డీఈవో, ఏపీసీ సర్వశిక్ష అభియాన్‌కు అప్పగించినట్టు చెప్పారు. ఇతర పనులను కూడా శాఖల వారీగా అప్పగించారు. అన్ని విభాగాల వారు తమకు కేటాయించిన విధులను సమర్థంగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, ఉద్యానవన శాఖ అధికారి ప్రసాదరావు, డీఎస్‌ఓ సూర్యప్రకాశరావు, దేవదాయశాఖ అధికారి ప్రసాద్ పట్నాయక్, వ్యవసాయాధికారి త్రినాథస్వామి, అరసవల్లి ఆలయ ఈవో వై.భద్రాజీ, సమాచార సౌర సంబంధాల శాఖ అధికారి కె.చెన్నకేశవరావు, పర్యాటకాధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో వెంకటేశ్వరరావు

బడ్డిపోలమ్మ జాతరకు సన్నాహాలు

- రేపే ముహూర్తం

పలాస, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి... పలాస గ్రామ దేవత బడ్డిపోలమ్మ అమ్మవారి జాతరను ఉగాది నాడు (ఆదివారం) నిర్వహించడానికి ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు ఆలయాన్ని సర్వాంగసుందరంగా అలంకరిస్తున్నారు. అమ్మవారిని నమ్ముకున్న వారికి ఆరోగ్యం, ఐశ్వర్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. యమబాధలు నివారించేందుకు గ్రామదేవతగా బడ్డిపోలమ్మ జన్మించినట్లు చరిత్ర చెబుతోంది. 120 ఏళ్ల క్రితం గుడిలో అమ్మవారికి వినియోగించిన శంఖాన్ని పూజారి మరిచిపోయి... తిరిగి దాన్ని తీసుకు వచ్చేందుకు ఆలయంలోకి వెళ్లగా... ప్రీకంఠంతో పెద్ద శబ్దం రావడంతో భయంతో ఆ పూజారి ఆలయం వెలుపలే నిలబడిపోయాడట. అనంతరం అమ్మవారి మహిమతో ఆ శంఖం వంద గజాల దూరంలో పడిందని... అప్పటి నుంచి ఆ శంఖాన్నే అమ్మవారి అంశగా భావిస్తూ దానికే పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అనంతరం భక్తులు అమ్మవారి విగ్రహాన్ని, గుడిని పూర్తిస్థాయిలో నిర్మించి ఏటా ఉగాది రోజున జాతర నిర్వహిస్తున్నారు. పడి(బియ్యం, వేపాకులు) పట్టుకొని అమ్మవారికి భక్తులు మొక్కులు సమర్పించుకుంటారు. ఈ ఏడాది భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉండడంతో ఆమేరకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు.



అమ్మవారి ఆలయానికి రంగులు వేసిన దృశ్యం



బడ్డిపోలమ్మ అమ్మవారు

మంచు కురిసే వేళలో..



జమ్ము వద్ద రహదారిపై ఇలా..

నరసన్నపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఓవైపు ఉదయం 8 గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. పది గంటల తరువాత బయటకు రావడానికే భయపడేంతగా ఎండల తీవ్రత ఉంటోంది. మరోవైపు పొగమంచు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా కురుస్తోంది. శుక్రవారం ఉదయం 8 గంటల వరకు మంచు కురిసింది. ఉదయం 7గంటల వరకూ వాహనదారులు లైట్ల వెలుగులోనే ముందుకెళ్లాల్సి వచ్చింది.

వేడుకగా బుడ్డు యాత్ర

ఇచ్ఛాపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో 36వ వార్షిక బుడ్డు యాత్ర (మహాతీర్థ స్నాన యాత్ర)ను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తొలుత బాహుదా నదిలో మహిళా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. బిందెలతో నీరు తీసుకెళ్లి నదీ తీరాన ఉన్న పాతాళ సిద్ధేశ్వర హర గౌరీ స్వామికి అభిషేకించారు. అనంతరం పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఈ యాత్ర సందర్భంగా అఖండ దీపారాధన, గంగా భవాని కి కుంకుమ పూజలు, హరినామ సంకీర్తనలు ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హరిపురం అసిరమ్మ కోలాట బృందం గురువు ధనుంజయ ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శించారు. ఎంకే రావు భక్త బృందం ఆధ్వర్యంలో సంగీత కచేరి నిర్వహించారు.



అలరించిన చిన్నారుల కోలాటం

రంజాన్ సన్మార్గానికి మారు పేరు: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పాల్గొన్న ఎమ్మెల్యేలు

శ్రీకాకుళం కలెక్టరేట్/శ్రీకాకుళం కల్చరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసం సన్మార్గానికి మారుపేరని కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో మైనార్టీ సంక్షేమశాఖ ద్వారా రంజాన్ పురస్కరించుకుని ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి జాన్ సుధాకర్, డీఎస్‌ఓ సూర్యప్రకాష్, చెన్నకేశవరావు పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టి సారించాలి: ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళంఅర్బన్,మార్చి28(ఆంధ్రజ్యోతి):ప్రజల సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. శుక్రవారం శ్రీకాకుళంలోని నగరపాలకసంస్థ కార్యాలయాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యం, ఆరోగ్యతదితర సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయన వెంట కమిషనర్ పీవీవీ ప్రసాదరావు,హెల్త్ ఆఫీసర్ సుధీర్‌కుమార్ ఉన్నారు.

ఇరిగేషన్ అధికారులపై కేసుల ఉపసంహరణ

ఆమదాలవలస/పొందూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి):పొందూరు మండలంలోని రెల్లిగెడ్డ అభివృద్ధి పనుల్లో నీటిపారుదలశాఖ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి నిబంధనలు ఉల్లంఘించారని పేర్కొని 2023లో వైసీపీ ప్రభుత్వం ఐదుగురు ఇరిగేషన్ అధికారులపై నమోదుచేసిన కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకున్నట్లు టీడీపీ కార్యాలయం వర్గాలు ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. పొందూరు మండలంలోని కొల్లిపేట నుంచి ఆమదాలవలస మండలంలోని నెల్లిమెట్ట వరకు రెల్లిగెడ్డ అభివృద్ధి పనుల్లో నీటిపారుదలశాఖ ఉద్యోగులు నిబంధనలు ఉల్లంఘించారని వైసీపీ ప్రభుత్వం నీటిపారుదలశాఖ ఉద్యోగులపై కేసు నమోదుచేసిన విషయం విదితమే.రెల్లిగెడ్డ అభివృద్ధి పనులను చేపట్టాలన్న ఉద్దేశంతో కేసును పునఃపరిశీలించాలని ఎమ్మెల్యే కూనరవికుమార్ ప్రభుత్వానికి నివేదించినట్లు టీడీపీకార్యాలయవర్గాలు తెలిపాయి.ఈవిషయంపై స్పందించిన రాష్ట్ర ఇంజనీరింగ్ ఇన్‌చీఫ్ అడ్మినిస్ట్రేషన్ వాటర్‌రిసోర్స్ డిపార్ట్‌మెంట్ ఐదుగురు ఇంజనీరింగ్ అధికారులపై 2023లో నమోదుచేసిన క్రిమినల్ కేసు ఉపసంహరించుకున్నట్లు ప్రకటించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నాయి.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సోమశేఖర్‌రెడ్డి

ఇచ్ఛాపురం, మార్చి28(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎం.సోమశేఖర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.శుక్రవారం కోర్టు ఆవరణలో నిర్వహించిన ఎన్నికల్లో కార్యదర్శిగా జి.కామేష్, ట్రెజరర్‌గా ఆర్.దేవరాజ్‌రెడ్డి ఎన్నికయ్యారు, ఈ సందర్భంగా న్యాయవాదుల నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

మార్కెట్ ఆశీల వేలం పాట ఖరారు



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

ఆమదాలవలస, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస మునిసిపాలిటీకి సంబంధించిన మార్కెట్ ఆశీలువేలం పాట ఎట్టకేలకు ఖరారయ్యింది. శుక్రవారం మునిసిపల్‌కార్యాలయంలో మేనేజర్ బిషోయ్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి మూడోసారి మార్కెట్ ఆశీల వేలంపాట నిర్వహించారు. తొలుత సర్కారీవారి పాట రూ.18 లక్షల 24 వేలుగా ఖరారు చేసి పాటను అధికారులు ప్రారంభించగా, కాంట్రాక్టర్ బొడ్డేపల్లి దాలినాయుడు రూ.22 లక్షల 50 వేలకు పాడిదక్కించుకున్నారు. ఈసందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ 22 లక్షల 50వేల రూపాయలకు అదనంగా ఐదు లక్షలు స్వీపర్ చార్జీలు చెల్లించాలని తెలిపారు.

30, 31 తేదీల్లో తెరవనున్న ఈఆర్వో కౌంటర్లు

అరసవల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి):విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈనెల 30, 31 తేదీలు సెలవురోజులైనా అన్ని కలెక్షన్ కౌంటర్లు, ఈఆర్వో కౌంటర్లు పనిచేస్తాయని ఏపీఈపీడీసీఎల్ ఎస్.ఈ ఎన్.కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బసవపుట్టుగలో ఒకరి ఆత్మహత్య

కంచిలి,మార్చి28(ఆంధ్రజ్యోతి):మండలంలోని జాడుపూడి పంచాయతీ పరిధిలో గల బసవపుట్టుగలోగల జీడితోటలో కవిటి మండలంలోని సహాలాలపుట్టుగ పంచాయతీ ముల్లు వీధికి చెందిన తుపాకి కూర్మారావు (43) మర్రిచెట్టు ఊడలకు ఉరిపోసుకుని శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు,కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు కథనం మేరకు.. ముల్లు వీధికి చెందిన కూర్మారావు మద్యానికి బానిసయ్యాడు. ఈనేపథ్యంలో భార్యతో గొడవలు పడుతూ 20సంవత్సరాల కిందట విడిగా ఉంటుడు. శుక్రవారం ఉదయం బసవపుట్టుగ శివారులోని జీడితోటలో ఉన్న మర్రిచెట్టుకు ఉరిపోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కూర్మారావు అన్న దీనబంధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆదిత్యాలయంలో మహా లింగార్చన

అరసవల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి):అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అనివెట్టి మండపంలో శుక్రవారం శివ పంచాయతన సహిత మహాలింగార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆదిత్యాలయంలో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ, వివేక్‌శర్మ పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు ఇంటర్వ్యూలు

సరుబుజ్జిలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సబ్సిడీ రుణాల దరఖాస్తుదారులకు బ్యాంకు అధికారులతో కలిసి ఎంపీడీవో ఎం.పావని శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు.మండలంలోని 21 పంచాయతీలకు 52 యూనిట్లు మంజూరు కాగా 271 మంది దరఖాస్తులు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ పి.చంద్రమౌళి, ఏపీజీవీబీ మేనేజర్లు హెచ్.అమర్‌నాథ్, కె.రవికుమార్, మహేంద్ర పాల్గొన్నారు.

నేడు ఆమదాలవలసలో..

ఆమదాలవలస, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేస్తున్న సబ్సిడీ రుణాలకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆర్.వెంకటరావు తెలిపారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాల పరిశీలనతో పాటు బ్యాంకు అధికారులతో కలిసి అర్హులైన దరఖాస్తుదారులను ఎంపికచేయనున్నట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీల వేతనాల్లో కోత విధించవద్దు

అరసవల్లి,మార్చి28(ఆంధ్రజ్యోతి):ఫేస్ యాప్ పేరుతో అంగన్‌వాడీల వేతనాల్లో కోతలు విధించవద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు,అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కళ్యాణి, కార్యదర్శి డి.సుధ కోరారు. శ్రీకాకుళంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో పీడీ బి.శాంతిశ్రీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు హైమవతి, హేమలత, కాంచన, మోహిని, దుర్గ పాల్గొన్నారు.

ఓబీసీ జాబితాలో చోటు లభిస్తేనే భవిష్యత్తు

పొందూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):శిష్టకరణాలకు ఓబీసీ జాబితాలో చోటు లభిస్తేఆ సామాజికవర్గ విద్యార్థులు, యువతకు భవిష్యత్తు ఉంటుందని పొందూరు శిష్టకరణ సంఘ ప్రతినిధులు తెలిపారు. పొందూరులో శుక్రవారం శిష్టకరణసంఘ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రతినిధులు వి.దామోదరరావు, దివాకర్‌పాత్రో, ఉమామహేశ్వరరావు, బలివాడ గోవిందరావు, కె. రవికుమార్, నీరజ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

- ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అశోక్



బాధితుడు దిక్కల కేశవరావుకు సీఎంఆర్‌ఎఫ్ ఆర్డర్ కాపీ అందజేస్తున్న అశోక్

కంచిలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తెలిపారు. కంచిలి మండలంలోని మండపల్లి గ్రామానికి చెందిన దిక్కల కేశవరావు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.1,00457లు చెక్కుకు సంబంధించిన ఆర్డర్ కాపీని అశోక్ కవిటి మండలంలోని రామయ్యపుట్టుగలోగల తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు మాదిన రామారావు,సంపతరావు, మాదిన ప్రదీప్ పాల్గొన్నారు.

డీఈవోపై చర్యలు తీసుకోవాలి

కవిటి,మార్చి28(ఆంధ్రజ్యోతి):డీఈవోపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక సభ్యులు కోరారు. రామయ్యపుట్టుగలో ప్రభుత్వ విప్ బి.అశోక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల అక్రమసస్పెన్షన్‌లను రద్దుచేసి వారిపై క్రిమినల్ కేసులు ఉపసంహరించాలని కోరారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు



యాగాటపాలేం వద్ద బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవాడికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శుక్రవారం మండలంలోని కమ్మసిగడాం, వేల్పురాయి, బంటుపల్లి, అర్జునవలస, వల్లభరావుపేట, దేరసాం, పాతర్లపల్లిల్లో ఇటీవల సీసీ, బీటీ రోడ్లు ప్రారంభించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో ఎనిమిది నెలల్లో రూ 70 కోట్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డీజీఎం ఆనందరావు, పిసిని జగన్నాథంనాయుడు, చిన్నమౌళి, బుజ్జి, వెలిచేటి రామకృష్ణ, దుమ్ము అశోక్, కనకారావు తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

నిర్వహణ లేక.. శిథిలావస్థకు చేరి

- ఇదీ ఇచ్ఛాపురంలోని యూ కాంప్లెక్స్‌లోని షాపుల పరిస్థితి



యూ కాంప్లెక్స్‌లో శిథిలావస్థకు చేరిన షాపులు

ఇచ్ఛాపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోగల యూ కాంప్లెక్స్‌లోని షాపులు నిర్వహణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. మునిసిపల్ యంత్రాంగం మరమ్మతులపై దృష్టిసారించకపోవడంపై షాపుల్లోని వ్యాపారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

టీడీపీహయాంలో 1997-98లో రహదారివిస్తరణలో భాగంగా పలువురు దుకాణదారులు షాపులు కోల్పోయారు. దీంతో అప్పటి ఎమ్మెల్యే ఎంవీ కృష్ణారావు, మునిసిపల్ చైర్‌పర్సన్ కాళ్ల వెంకటలక్ష్మి చొరవతో 20షాపులతో యూకాంప్లెక్స్‌ను ఏర్పాటుచేసి నిర్వాసితులకు కేటాయించారు.నిత్యం రద్దీగా ఉండేఆస్పత్రిరోడ్డు, మునిసిపల్ బాలుర పాఠశాలరోడ్డులోఉన్న ఈ షాపింగ్‌కాంప్లెక్స్‌లో వ్యాపారాల లావాదేవిలకు ప్రజల నుంచి ఆదరణ కూడా లభిస్తోంది. ఇవి నిర్మించి రెండు దశాబ్దాలుదాటుతుండడంతో మరమ్మతులు, నిర్వహణకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. ఒక్కో దుకాణం నుంచి నెల కు రూ.రెండు నుంచి రూ.మూడు వేల వరకూ అద్దె రూపంలో వసూలు చేస్తున్నారు. కాగాయూకాంప్లెక్స్‌పై శిథిలావస్థకు చేరుకోవడం పై కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్తామని కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు. నిధులకోసం ప్రతిపాదనలు రూపొందిస్తామని, షాపుల మరమ్మతులు చేపడతామని చెప్పారు.

ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలపై సస్పెన్షన్లు ఎత్తివేత

గుజరాతీపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి):పదోతరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరిగిందన్న అభియోగంపై ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులపై విధించిన సస్పెన్షన్లను ఎత్తివేశారు. ఈ మేరకు ఏడుగురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్లను ఎత్తివేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు జారీచేశారు. ముగ్గురు ప్రధానోపాధ్యాయులపై కూడా సస్పెన్షన్లను ఎత్తివేస్తూ ఆర్జేడి ఆదేశాలిచ్చారు. ఆయా ఉపాధ్యాయులను స్థానచలనం లేకుండా ఎక్కడివారికక్కడే నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు.మరికొందరు ఉపాధ్యాయులకు విచారణ అనంతరంసస్పెన్షన్లు ఎత్తివేసే అవకాశముంది.నాలుగు రోజుల నుంచి ఉమ్మడి ఉపాధ్యాయసంఘాలు ధర్నాలు, ర్యాలీ, నిరసన దీక్షలు నిర్వహిస్తున్న విషయం విదితమే.ఉపాధ్యాయులకు న్యాయంచేయాలని ఆందోళనకు దిగడంతో పాటు డీఈవోపై కూడా చర్యలు తీసుకోవాలని అధికారులకు, జిల్లాకు సంబంధించిన మంత్రి, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులకు ఉపాధ్యాయ సంఘ నేతలు కలిసి డిమాండ్‌చేశారు. దీంతో ఏడుగురు ఉపాధ్యాయులపై సస్పెన్షన్లు ఎత్తివేస్తూ ఉత్తర్వులను జారీచేశారు. మొత్తం 14 మందిలో 10 మందికి సస్పెన్షన్లు ఎత్తివేయడంతో ఉపాధ్యాయ సంఘాలకు ఉపశమనం లభించింది.

పాస్టర్ మృతిపై విచారణ జరపాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మృతిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని క్రిస్టియన్ సెక్యూరిటీ సర్వీసెస్ (సీఎస్‌ఎస్) జిల్లా కమిటీ అధ్యక్షుడు బిషప్ బర్నబాస్ బింకం, ప్రధాన కార్యదర్శి ఒంపూరు రమేష్ కోరారు. ఈ మేరకు జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు, పాస్టర్లు, ఎం.షడ్రక్ బాబు, జి.సామ్యూల్ అరుణ్‌కుమార్, టి.పేతురు, ఇ.శామ్యూల్ జాన్, పత్రిపాటి ప్రసాద్, ఏప పాల్, అల్లు ఇమ్మాన్యుయేల్, ఆశిర్‌కుమార్, ఆహరోన్ పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలి: ఎస్పీ

కవిటి, మార్చి28 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మత్తుపదార్థాలు అక్రమరవాణాను అరిక ట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కోరారు. శుక్రవారం కవిటి పోలీసు స్టేషన్‌ను వార్షికతనిఖీలో భాగంగా రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు తనిఖీలు నిర్వహించి మత్తుపదార్థాలు అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీ వి.వెంకట అప్పారావు, సీఐ కె.చిన్నంనాయుడు,ఎస్ఐ వి.రవివర్మ ఉన్నారు.

ఘనంగా నూకాలమ్మతల్లి అమ్మవారి సంబరం

ఇచ్ఛాపురం, మార్చి28(ఆంధ్రజ్యోతి):సంతపేటజంక్షన్‌లో కొలువుదీరిన నూకాలమ్మతల్లి అమ్మవారి సంబరమహోత్సవాలు ఘనంగా జరిగాయి.శుక్రవారం వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు, అమ్మవారికి సింధూర మర్ధన, పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాలతో కార్తీవీధి నుంచి దాసన్నపేట మీదుగా మెయిన్‌రోడ్డు నుంచి తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కాళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇరిగేషన్ కాలువపై ఆక్రమణ తొలగింపు

శ్రీకాకుళంరూరల్, మార్చి28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగుపురం ఇరిగేషన్ కాలువపై ఆక్రమణలను తొలగించారు.సింగుపురానికి చెందిన సర్వే నెంబర్ 505/1బిలో2లోఉన్న 0.76సెంట్ల ఇరిగేషన్ భూమిని కొందరు ఆక్రమించుకున్నారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ ఎం.గణపతిరావు,ఇరిగేషన్ డీఈ, జేఈ, వీఆర్వో విశ్వనాథం ఆక్రమణకు గురైన ఇరిగేషన్ కాలువను పరిశీలించి యంత్రంతో తొలగించారు. కాగా ఈ భూమిని ధర్మాన ధర్మారావు అనే వ్యక్తి ఆక్రమించుకున్నాడని, వాటిని పోలీసు బందోబస్తు మధ్య తొలగించామని తహసీల్దార్ గణపతి పేర్కొన్నారు.

ఎంపీడీవో నిలదీత

బూర్జ,మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీలకు మండలపరిషత్‌లో జరుగుతున్న పనుల విషయంలో సమాచారం ఇవ్వడం లేదని ఎంపీపీ, జడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు ఎంపీడీవో తిరుపతిరావును నిలదీశారు. శుక్రవారం బూర్జలో ఎంపీపీ కె.దీప అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. అనంతర 2025-26 సంవత్స రానికి సంబంధించి బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు.కార్యక్రమంలో జడ్పీటీసీ బి.రామారావు, వైస్ ఎంపీపీలు పి.సూర్యారావు, కృష్ణమూర్తినాయుడు, గోవిందరావు, ఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలి



అరసవల్లి: శ్రీకాకుళంలో నిరసన తెలుపుతున్న నాయకులు

అరసవల్లి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. స్థానిక జీటీ రోడ్డులో గల ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం ఎదుట పెంచిన విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, నాయకులు భవిరి కృష్ణమూర్తి, కె.నాగమణి,ఆదినారాయణమూర్తి, వెలమల రమణ, తూతిక ప్రవీణ, లక్ష్మి, లలిత పాల్గొన్నారు.

- ఎచ్చెర్ల, మార్చి 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రూఅప్ చార్జీలు రద్దుచేయాలని సీపీఎం నాయకులు కోరారు. శుక్రవారం ఎచ్చెర్లలోని సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సం దర్భంగా సీపీఎం నాయకుడు పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ను బిగించడం నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.బంగార్రాజు, జి.శ్రీనివాసరావు, ఎం.సురేష్, కె.గోవిందకుమార్, ఎల్.రాము, ఎన్‌వీ రమణ, ఎల్.సీతారామ్, జె.చిట్టప్పడు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో పారదర్శకత పాటించాలి: పీడీ

లావేరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత పాటించాలని డ్వామా పీడీ బి.సుధాకరరావు కోరారు. శుక్రవారం లావేరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ సామాజిక తనిఖీల మండల ప్రజావేదిక సభ జరిగింది. 33 పంచాయతీల్లో 2023-24 ఆర్థికసంవత్సరంలో రూ25.60 కోట్లతో చేపట్టిన పనులపై పది రోజులుగా ఎనిమిది డీఆర్‌పీ బృందాలు సామాజికతనిఖీ నిర్వహించాయి. ఈ మేరకు బినామీ మస్తర్లు, మస్తర్లలో దిద్దిబాట్లు, కొలతల్లో వ్యత్యాసాలు వంటి అవకతవకలను బృందాలు గుర్తించాయి.వీటికి సంబంధించి రూ.లక్షా 96 వేలు వరకు రికవరీకి ఆదేశించినట్లు ఎస్‌ఆర్‌పీ పున్నపు నాయుడు తెలిపారు.ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఉపాధిపనుల్లో ఎటువంటి అవకతవకలు చోటు చేసుకున్నా సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో డ్వామా ఫైనాన్స్ మేనేజర్ స్వరూపా రాణి, ఏపీడీలు శైలజ, లోకేష్, విజిలెన్స్ అధికారి శ్రావన్ కుమార్, ఎంపీడీవో వెంకటరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు ముప్పిడి సురేష్, మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, ఏపీవో ఆర్.సత్యవతి పాల్గొన్నారు.

మస్తరు పాయింట్ ఒకేచోట ఏర్పాటు చేయాలి

ఆమదాలవలస, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గతంలో మాదిరిగా మస్తరు పాయింట్‌ను ఒక చోట ఏర్పాటుచేయాలని మునిసిపల్ యూనియన్ నాయకుడు తాడి సంతోష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలో మేనేజర్ బిసోయి లక్ష్మీనారాయణకు తమ సమస్యలను పరిష్కరించాలని కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులమస్తర్ పాయింట్‌ను మూడు చోట్ల పెట్టడంతో తెల్లవారు జామున విధులకు వెళ్లే సమయంలో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మేనేజర్ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో కార్మికులు రాజేష్, శ్రీనివాస్, తారక, శ్రీను, ఈశ్వరరావు, రాజేష్ పాల్గొన్నారు.

సమగ్ర వివరాలతో సర్వే నిర్వహించండి

సరుబుజ్జిలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరా క్రాంతి భవనంలో సర్వేకు ఎంపికచేసిన సీసీ వీవో ఎన్యుమరేటర్లకు శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకేపీ ఏపీఎం సీహెచ్ గోవిందరాజులు మాట్లాడుతూ గ్రామాల్లో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జీవనోపాదుల ప్రణాళిక సర్వేను సమగ్ర వివరాలతో నిర్వహించాలని కోరారుకార్యక్రమంలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు పి.మణెమ్మ, అకౌంటెంట్ కళ్యాణి పాల్గొన్నారు.

- ఇచ్ఛాపురం, మార్చి28(ఆంధ్రజ్యోతి):గ్రామ సంఘాల నుంచి అంతర్గత అప్పులు, స్త్రీనిధి ఉన్నతి, సీఐఎఫ్ రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతంకావాలని ఏపీఎం ఎస్.ప్రసాద్ తెలిపారు. ఇచ్ఛాపురంలో ఎన్యుమరేటర్లకు రెండోరోజు శిక్షణ నిర్వహించారు.
- బూర్జ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):బూర్జలో శుక్రవారం స్వయం సహాయక సంఘాలకు జీవనోపాదుల ప్రణాళికల తయారీపై ఏపీఎం బాబూరావు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో రాంబాబు, సీసీలు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

గుజరాతీపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతి నగర్ కాలనీలోని నాలుగో లైన్‌లో గల జువైనల్ జస్టిస్ బోర్డులో పోక్సో చట్టంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి జామరుద్ బేగం చట్టం గురించి వివరించారు.

ఢిల్లీరావు కుటుంబానికి న్యాయం చేయండి

● మాజీ మంత్రి అప్పలరాజు



డీఎస్పీతో వాగ్వాదానికి దిగిన మాజీ మంత్రి అప్పలరాజు

పలాస, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంతానికి చెందిన తెప్పల ఢిల్లీరావు విద్యుత్ తీగలు తగిలి మృతి చెంది మూడు నెలలు కావస్తున్నా.. ఎలా మృతి చెందారో ఇప్పటి వరకు నిగ్గు తేల్చలేదని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. మృతుడి భార్య కమలమ్మతో కలిసి ఆందోళనకు దిగారు. ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విష యం తెలుసుకున్న డీఎస్పీ వి.వెంకట అప్పారావు అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. దౌర్జన్యం చేస్తూ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేయడం తగదని, మృతి వ్యవహారంపై తాము దర్యాప్తు చేస్తున్నామన్నారు. దర్యాప్తునకు కొంత సమయం పడుతుందని, దీన్ని రాజకీయం చేయడం తగదని హెచ్చరించారు. దీంతో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం స్టేషన్‌లో ఆందోళనకారులతో చర్చించారు. సంయమనం పాటించాలని, నిజాలు నిగ్గుతేల్చి ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని డీఎస్పీ చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం అప్పలరాజు విలేకరులతో మాట్లాడుతూ బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాడతామన్నారు.

1.50 కిలోల గంజాయి స్వాధీనం

మెళియాపుట్టి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): గొప్పిలి గ్రామానికి చెందిన బైపోతు యవరాజు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీ చేసి అతని వద్ద నుంచి 1.50 కిలోలు స్వాధీనం చేసుకున్నట్లు పాతపట్నం సీఐ రామారావు తెలిపారు. గురువారం రాత్రి తనిఖీ చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పిన్నింటి రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.

అపరాల పంట అగ్నికి ఆహుతి

హరిపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): హరిపురం-మందస రోడ్‌లో వీజీపురం వద్ద శుక్రవారం సుమారు 5 ఎకరాల అపరాల పంట అగ్నిప్రమాదానికి గురైంది. శ్రీనివారావు, రామారావు, లక్ష్మీనారాయణ సుమారు ఐదెకరాల్లో వేసిన మినుము నువ్వు, గిలకల పంటలు అగ్నికి ఆహుతయ్యాయి. వేసవి కావడంతో సిగరెట్ కాల్చి పడేయడంతో మంటలు వ్యాపించి దగ్ధమై ఉంటాయని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది, గ్రామస్థులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

అగ్నిప్రమాదంలో ఏపీ ఫైబర్ వైర్లు దగ్ధం

పలాస, మార్చి 28(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఆవరణలో ఏపీ ఫైబర్‌గ్రిడ్‌కు సంబంధించిన వైర్లు శుక్రవారం దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదం ఏ విధంగా జరిగిందో తెలియరాలేదు. మంటలు వ్యాపిస్తుండడంతో స్థానికులు అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.10వేలు విలువైన వైర్లు కాలిపోయి ఉంటాయని అంచనా.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

పాతపట్నం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సీఐ కోట కృష్ణారావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సారా నియంత్రణ మండల కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు నవోదయం 2.0 రూపొందించడం జరిగిందన్నారు. మండల పరిధిలోని పాత ముద్దాయిలపై బైండోవర్ కేసులు నమోదు చేయించి వారిని తహసీల్దార్ ఎదుట హాజరు పరచగా రూ.2 లక్షలు విధిస్తూ బైండోవర్ కేసులు చేయడం జగిందన్నారు. ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ఎంపీడీవో పి.చంద్రకుమారి, సీఐ వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను కాపాడిన యువకులకు సత్కారం



యువకులను సత్కరిస్తున్న డీఎస్పీ వెంకటఅప్పారావు

హరిపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బస్సు ప్రమాదంలో చిన్నారులను కాపాడి ఆపద్బాంధవులయ్యారని కాశీబుగ్గ డీఎస్పీ వెంకటప్పారావు అన్నారు. ఉమాగిరి వద్ద ఇటీవల ఒక ప్రైవేటు స్కూల్ బస్సు చెరువులో బోల్తాపడిన ఘటనలో 22 మంది విద్యార్థులను గ్రామానికి చెందిన యువత కాపాడిన సంగతి తెలిసిందే. వీరి సేవలను గుర్తించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మోహనరావు గౌడ, సుభాష్‌గౌడ, హేమంత్, గోపీకృష్ణ, ప్రసాద్‌లను దుశ్శాలువా కప్పి డీఎస్పీ సత్కరించారు. సమాజంలో యువతకు ఇటువంటి సేవా కార్యక్రమాలే స్ఫూర్తినిస్తాయన్నారు. కార్యక్రమంలో సీఐ తిరుపతిరావు, ఎస్ఐ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం

నరసన్నపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): దేశంలో ఉద్యోగ, ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.సంతోష్, కె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఒక ఐటీఐ వద్ద ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల లోగోను ఆవిష్కరించారు. మే 15 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో జరగనున్న జాతీయ మహాసభలను విజయవంతంచేయాలని కోరారు. సంఘ నాయకులు అరవింద్, వసంత్, తదితరులు పాల్గొన్నారు.

రూ.14 లక్షలకు ఆశీలు ఖరారు

టెక్కలి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్‌పంచాయతీ ఆశీలు రూ.14 లక్షలకు ఖరారు చేశారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ఆశీలు వేలంపాట నిర్వహించారు. డైలీ మార్కెట్ పాట గత ఏడాది రూ.12.66 లక్షలు కాగా, ఈ ఏడాది రూ.14 లక్షలకు పుచ్చకాయల రామిరెడ్డి వేలం పాడి కైవసం చేసుకున్నారు. వారపు సంత గత ఏడాది రూ.58 వేలు ఉండగా ఈ ఏడాది రూ.77 వేలకు, బస్సు కారు స్టాండ్ గత ఏడాది రూ.33,300 ఉండగా ఈ ఏడాది రూ.51 వేలకు రామిరెడ్డి కైవసం చేసుకున్నారు. కబేలా గత ఏడాది రూ.1,35,500లు కాగా ఈ ఏడాది రూ.1,60,200లకు జోగి ధర్మారావు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో ఈవో కె.సింహాద్రినాయుడు, సర్పంచ్ గొండేల సుజాత, ఇన్‌చార్జి ఈవో శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాశయాల వైపు దృష్టి సారించాలి

టెక్కలి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నతాశయాల వైపు దృష్టి సారించాలని, అప్పుడే అనుకున్న లక్ష్యాలు నెరవేరుతాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలన్నారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వాసుబాబు, కోటేశ్వరరావు, డాక్టర్ ఆచార్యులు పాల్గొన్నారు.

ఆహారంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు

● ఎస్పీ మహేశ్వరరెడ్డి

హరిపురం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు అందిస్తున్న ఆహారంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి హెచ్చరించారు. మందస మండలం వీజీపురంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. గురువారం పాఠశాలలో విషాహారం తిని 22 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలుసు కున్న ఆయన పాఠశాలను సందర్శించి అనారోగ్యానికి గురైన విద్యార్థినులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం ఆహార పదా ర్థాలను పరిశీలించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని, వేసవి దృష్ట్యా తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మరమ్మతుకు గురైన తాగునీటి ప్యూరిఫైర్‌ను బాగు చేయించాలన్నారు. విద్యార్థినులతో మాట్లాడి ఎటువంటి సమస్యలు, ఇబ్బందులున్నా నిర్భయంగా తెలియజేయాలని సూచిం చారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. కార్యక్ర మంలో ఎంఈవో ఎం.లక్ష్మణరావు, సీఐ తిరుపతిరావు, చిన్నంనాయుడు, ఎస్ఐ కృష్ణప్రసాద్, కేజీబీవీ ప్రత్యేకాధికారి వాసంతి తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

పలాస, మార్చి 28(ఆంధ్రజ్యోతి):కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో నేరాల కట్టడి, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులకు ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం కాశీబుగ్గ డీఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి వివిధ అంశాలపై చర్చించారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, మహిళా



పలాస: రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

సమస్యల పరిష్కారం, అట్రాసిటీ, ప్రాపర్టీ, మహిళ సంబంధిత కేసుల దర్యాప్తును 60 రోజుల్లో పూర్తి చేసి చార్జ్‌షీట్‌ను కోర్టులో దాఖలుచేయాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ వి.వెంకట అప్పారావు, సీఐ, ఎస్ఐలు ఉన్నారు. అంత కుముందు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రజాసమస్యల పరిష్కారవేదికను ఎస్పీ మహేశ్వరరెడ్డి నిర్వహించారు. ప్రజల వినతులు స్వీకరించి వారితో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు

● సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీనివాసరావు

టెక్కలి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): లైంగిక నేరాలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా కఠిన శిక్షలు విధించబడతాయని సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లలు లైంగిక నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలపై జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవడం, లైంగిక వేధింపుల నుంచి రక్షణ కోసం ప్రభుత్వం పోక్సో చట్టాన్ని రూపొందించిందన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, ప్రిన్సిపాల్ సుధారాణి, ఎస్ఐ రఘునాథరావు, న్యాయవాదులు గోవింద్, బాలకృష్ణ, ఆనందరావు, శ్రీనివాస్, ఎంఈవోలు చిన్నారావు, తులసీరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురికావద్దు



మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీభరణి

పాతపట్నం, మార్చి 28(ఆంధ్రజ్యోతి):విద్యార్థినులు ప్రలోభాలకు గురికావద్దని స్పెషల్ (ప్రొహిబిషన్,ఎక్సైజ్) జ్యుడీషియల్ న్యాయాధికారి డి.శ్రీభరణి అన్నారు. స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం పోక్సో చట్టంపై అవగాహన కలిగించారు. నేరారోపణ అంశాలు, పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.అర్చన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీఈ సత్యనారాయణ, న్యాయవాది ఎం.రమణ, ఎస్ఐ బి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారంపై హర్షం

● ఎమ్మెల్యే చిత్రపటానికి పాలభిషేకం



ఎమ్మెల్యే గౌతు శిరీష చిత్రపటానికి మహిళల పాలభిషేకం

పలాసరూరల్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): శాసనం గ్రామంలో దశాబ్దాలుగా నెలకొన్న నీటి సమస్యను 24 గంటల్లోగా పరిష్కరించిన ఎమ్మెల్యే గౌతు శిరీష చిత్రపటానికి స్థానికులు శుక్రవారం పాలభిషేకం చేశారు. గ్రామంలోని నీటి సమస్యను ఇటీవల స్థానిక మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆమె స్పందించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి రూ.90 లక్షలు మంజూరు చేయడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

వజ్రపుకొత్తూరు,మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి పంచాయతీలో నిధులు దుర్వినియోగమైనట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు డీఎస్పీవో ఆర్.గోపిబాల శుక్రవారం విచారణ చేపట్టారు. 2021 నుంచి ఇప్పటివరకు నిధులు వినియోగంపై పంచాయతీ కార్యదర్శుల నుంచి వివరాలు సేకరించారు. రికార్డులను స్వాధీనం చేసుకొని పరిశీలిస్తామని ఆయన తెలిపారు. పంచాయతీ ఆదాయ వ్యయాలపై ఓచర్లు తనిఖీ చేసి నివేదికను 20 రోజుల్లోగా డీపీవోకి అందిస్తానన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీషకు గ్రామస్థుల నుంచి వచ్చిన ఫిర్యాదును కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారని, ఆయన ఆదేశాలతో ఈ విచారణ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి డి.తిరుమలరావు, సర్పంచ్ లండ వనజాక్షి, మాజీ సర్పంచ్ లండ రామలింగం, టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, శ్రీరామ సేవా సంఘం అధ్యక్షుడు మోన వరప్రసాద్. సింగుపల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో ప్రత్యేక గుర్తింపు: బగ్గు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ఎక్కువ సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ టీడీపీ అని, ఈ పార్టీలో సభ్యత్వం తీసుకున్న వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానికంగా ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో శుక్రవారం సభ్యత్వ నమోదు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు అధిష్ఠానం ప్రత్యేక గుర్తింపునిస్తుందన్నారు. నియోజకవర్గంలో 11 వేలు పైచిలుకు పార్టీ సభ్యత్వాలు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ బగ్గు అర్చన, పార్టీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు, కన్వీనర్ బగ్గు గోవిందరావు, నాయకులు పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ స్వామిబాబు, ఎం.దామోదరరావు, కింజరాపు సత్యం తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపరచుకోవాలి: ఎమ్మెల్యే ఎంజీఆర్



కొత్తూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

కొత్తూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బంది పనితీరు మార్చుకుని రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. శుక్రవారం కొత్తూరు సామాజిక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి అంతా కలియ తిరిగి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఇక్కడి వైద్యులు ప్రైవేటు ఆసుపత్రుల్లో పని చేస్తే చర్యలు తప్పవన్నారు. కొత్తభవనం పనులు పూర్తయితే రోగులకు వసతి సమస్య తీరనుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డి.కిశోర్ ఎమ్మెల్యేకు వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి భవన నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

పేదరికాన్ని అధిగమించడమే లక్ష్యం

పాతపట్నం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పేదరికాన్ని అధిగమించడమే పీ-4లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఐదు మండలాల ఎంపీడీవోలు, ఇతర అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న 10 మంది పేదరికంలో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 మందికి చేయూతనిస్తూ అభివృద్ధి చేయడం ఒక మార్గమన్నారు. పేదరిక నిర్మూలనకు ప్రజల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

హిరమండలం,మార్చి28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. హిరమండలంలో రక్షిత నీటి పథకం నుంచి తాగునీరు సక్రమంగా అందక పోవడంతో మహిళలు పలుమార్లు ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. శుక్రవారం గాంధీ నగర్‌లో కొత్త పైప్‌లైన్ల ద్వారా నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకట అప్పల నాయుడు, ఎంపీడీవో కాశీప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను పిల్లలకు తెలియజేయండి

● సినీనటి కవిత

వజ్రపుకొత్తూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగింటి సంప్రదాయ పండగల ప్రాముఖ్యతను పిల్లలకు తెలియజేయాలని సినీనటి కవిత అన్నారు. ఒంకులూరులో శుక్రవారం గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ గుంటు వేణుగోపాల్ ఆధ్వర్యంలో ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పలాస ప్రాంతంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. టీడీపీ ప్రచారంలో గౌతు శివాజీ తరఫున ప్రచారం చేశానన్నారు. వేణుగోపాల్ పుట్టి పెరిగిన ఒంకులూరు గ్రామాన్ని దత్తత తీసుకొని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుండడం అభినందనీయమన్నారు. తాను 45 ఏళ్లగా సినీ పరిశ్రమలో ఉన్నానని, ఇప్పటికీ తెలుగు ప్రజలు తనను గుర్తించి అభిమానిస్తున్నారన్నారు. ప్రస్తుతం పరిశ్రమకు వస్తున్న సినీ హీరోయిన్స్ నాలుగైదు ఏళ్ల తరువాత కనిపించడం లేదన్నారు. ఈ సందర్భంగా హైస్కూల్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. గ్రామంలో ఉపాధ్యాయులకు, గ్రామ స్థాయి అధికారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సినీ దర్శకుడు భాను ప్రకాశ్, జోగి అప్పారావు, లండ శ్రీధర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సినీనటి కవిత

కిడ్నీ పరిశోధన కేంద్రానికి అంబులెన్స్ వితరణ



వైద్యులకు అంబులెన్స్‌ను అందిస్తున్న టీడీపీ నాయకులు

పలాస, మార్చి 28(ఆంధ్రజ్యోతి): కిడ్నీ పరిశోధన కేంద్రానికి గౌతులచ్చన్న బలహీన వర్గాల సంస్థ (గ్లో) శుక్రవారం అంబులెన్స్‌ను అందజేసింది. గ్లో సంస్థ ప్రధాన కార్యదర్శి, పలాస టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకన్న చౌదరి జన్మదినం సందర్భంగా ఈ అంబులెన్స్‌ను వితరణ చేయగా టీడీపీ నాయ కులు వైద్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్ మాట్లాడుతూ.. కిడ్నీ రోగులకు అంబులెన్స్ ఎంతో విని యోగపడుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. షిర్డీసాయి ధ్యానమందిరంలో పేదలకు అన్నదానం చేశారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గాలి కృష్ణారావు, దువ్వాడ శ్రీకాంత్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, గురిటి సూర్యనారాయణ, ఎం.నరేంద్ర(చిన్ని), కొరికాన శంకర్, జోగ మల్లి, దడియాల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం కార్యకర్తలు

టెక్కలి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎవరు అధికారంలో ఉన్నా వినియోగదారులకు విద్యుత్ షాక్‌లు తప్పడం లేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నంబూరు షణ్ముఖరావు అన్నారు. శుక్రవారం స్థానిక ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ట్రూఅప్ సర్దుబాటు చార్జీలు, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, టైమ్‌ఆఫ్‌డే విధానం రద్దు చేయాలని, సెగీ ఒప్పందం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు కొల్లి ఎల్లయ్య, బగాది వాసుదేవరావు, హనుమంతు ఈశ్వరరావు, చంద్ర మౌళి, రవి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా

కొత్తూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ శుక్రవారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం నేతలు ధర్నా నిర్వహించారు. ట్రూఅప్ చార్జీలను పెంచి ప్రజలపై తీవ్ర భారం మోపిందని, తక్షణం దానిని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సిర్ల ప్రసాదరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్.అప్పన్న, మోహనరావు, లక్ష్మణరావు, దుర్గారావు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బకాయిలు చెల్లించడం హర్షణీయం

సంతబొమ్మాళి,మార్చి28(ఆంధ్రజ్యోతి): కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఉద్యోగుల బకాయిలు రూ2300 చెల్లించడం హర్షణీయమని రాష్ట్ర సీపీఎస్‌ఈఏ ఉపాధ్యక్షుడు రెడ్డి సూరిబాబు అన్నారు. ఫిబ్రవరి నెల వరకు ఉన్న బకాయిలను ప్రాన్ ఖాతాలో జమ చేసిందన్నారు. గత 17 ఏళ్లగా ఎప్పుడూ ఇలా పూర్తిగా చెల్లించిన పరిస్థితులు లేవన్నారు. అదే విధంగా 2018 జూలై నుంచి 2019 జనవరి వరకు ఆరు నెలల డీఏ బాకాయిలు విడుదల చేయాలని ఆయన కోరారు.

అత్యాచారయత్నం కేసులో అరెస్టు

సోంపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బారువ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మానసిక దివ్యాంగురాలిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడినట్లు బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు నిందితుడు శృంగారపు ప్రసాద్ ఆచారిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఇన్వెర్టర్ల చోరీపై కేసు

బూర్జ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): బూర్జ ఎంపీడీవో కార్యాలయంలో రెండు ఇన్వెర్టర్లు దొంగతనానికి గురవడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవల్లిక తెలిపారు. 15 రోజుల కిందట రెండు ఇన్వెర్టర్లు పోయినట్టు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సస్పెక్ట్ షీటర్ అరెస్ట్

శ్రీకాకుళంక్రైం,మార్చి28(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని మంగువారితోటలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించి వన్‌టౌన్ పోలీసులకు పట్టుబడిన కేసులో సస్పెక్ట్ షీటర్ బొమ్మలాట ఢిల్లీశ్వరరావును పోలీసులు అరెస్ట్ చేశారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సూవిస్తూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు ఢిల్లీశ్వరరావుపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపారు. ఆయనపై కొంతకాలంగా సస్పెక్ట్ షీట్ కూడా ఉందని తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

టెక్కలి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సామాజిక వేత్త, పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతికి కారకులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి స్థానిక అంబేడ్కర్ కూడలిలో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు, దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు బోకర నారా యణరావు, బెలమర ప్రభాకర్, యడ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

● నందిగాం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో పాస్టర్ ప్రవీణ్‌ను హతమార్చడం హేయమైన చర్య అని మండల దళిత సంఘ ప్రతినిధి ఎ.సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితుల్ని కఠినంగా శిక్షించాలని కోరారు. దళితులపై దాడులు నివారించాలని ఆయన కోరారు.

బీసీ రుణాల కోసం ఇంటర్వ్యూలు

నరసన్నపేట/జలుమూరు/ పోలాకి/వజ్రపుకొత్తూరు/హిరమండలం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వంలో బీసీలకు వ్యక్తిగత రుణాలు మంజూరు కోసం శుక్రవారం లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం చేపట్టారు. నరసన్నపేట, జలుమూరు, పోలాకి, వజ్రపుకొత్తూరు, హిరమండలం ఎంపీడీవో కార్యాలయాల్లో చేపట్టిన ఈ ప్రక్రియలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వందలాది మంది దరఖాస్తుదారులు హాజరై ధ్రువపత్రాలను అధికారులకు చూపించారు. నరసన్నపేటలో 710 మంది, వజ్రపుకొత్తూరులో 472 మంది, పోలాకిలో 522 మంది, జలు మూరులో 398 మంది, హిరమండలంలో 322 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. బీసీ కార్పొరేషన్ అధికారులు పాల్గొని అభ్యర్థుల సర్టిఫికెట్లను తనిఖీచేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరు, మెళియాపుట్టిలో నేడు..

కొత్తూరు/మెళియాపుట్టి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలంలో బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన 69 యూనిట్లకు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవోలు వి.నీరజ, ప్రసాద్‌పండా తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారంతా సర్టిఫికేట్లతో ఎంపీడీవో కార్యాలయంలో హాజరుకావాలని వారు ఆ ప్రకటనల్లో సూచించారు.